క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం వివిధ రకాల పూజలు నిర్వహించి స్వర్ణాభరణాలతో అలకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం జరిపించి మహామంగళ హారతులు ఇచ్చారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ప్రత్యేకంగా ముస్తాబు చేసిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ లక్ష్మీనారాయణ, ఆరవేటి వాసు, విజయ్‌కుమార్, అర్చకులు సుబ్బాచారి, రాఘవేంద్రాచారి, సుబ్రమణ్యం శాస్త్రి, తిమ్మయ్య పాల్గొన్నారు.

వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన


నూనెపల్లె అమ్మవారి శాలలో లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని అమ్మవారిశాలలో అధిక శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని శ్రీ వాసవీ మహిళా యూత్ ఆధ్వర్యంలో వాసవీ కల్యాణ మండపంలో లక్ష కుంకుమార్చన, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన జరిపించారు. హోమం చేపట్టి పూర్ణాహుతి గావించారు.

అన్నపూర్ణాదేవికి పంచామృతాభిషేకాలు.. పట్టణంలోని కోటావీధిలో వెలసిన శ్రీరమాసమేత సత్యనారాయణస్వామి దేవస్థానంలో అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని అన్నపూర్ణాదేవికి శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ నాగప్రసాద్, బాలుడు, అర్చకులు పాల్గొన్నారు.

98 డీఎస్సీక్వాలిఫైడ్స్‌కు ఉద్యోగాలివ్వాలి


డీఆర్‌ఓకు వినతి పత్రం ఇస్తున్న 98 క్వాలిఫైడ్ అభ్యర్థులు

నంద్యాల(అర్బన్): 98 డీఎస్సీలో మిగిలిపోయిన క్వాలిఫైడ్స్ అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని నంద్యాల జిల్లా 98 డీఎస్సీ క్వాలిఫైడ్స్ అసోసియేషన్ నాయకులు వెంకటరమణ, సంజీవకుమార్, మధుబాబు కోరారు. రిమైనింగ్ క్వాలిఫైడ్‌లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరుతూ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్‌ఓ పుల్లయ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏప్రిల్‌లో 435 మందికి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగాలు ఇచ్చారని, రిజర్వేషన్లు పాటించకపోవడంతో ఎంతోమందికి ఉద్యోగ అవకాశాలు అందలేదన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన ప్రతిఒక్కరికి ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. నాయకులు జంగం చిన్న దస్తగిరి, ద్వారకానాథ్, జాన్‌బాబు, చెన్నకేశాలు, సుబ్బయ్య, శివమ్మ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి చెస్ జట్టు ఎంపిక పోటీలు

నంద్యాల(న్యూటౌన్):రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో పాల్గొనేందుకు నంద్యాలలో జిల్లాస్థాయి చెస్ జట్టు ఎంపిక పోటీలు ఆంధ్రా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు.శుక్రవారం వారు మాట్లాడుతూ 13 సంవత్సరాల్లోపు బాలికలు పాల్గొనాలని సూచించారు. ఈనెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా టెక్కె భరతమాత గుడి సమీపంలో ఉన్న నెరవాటి ఇంగ్లిష్ మీడి యం స్కూల్ ఆవరణలో పోటీలు ఉంటాయని, పాల్గొనే క్రీడాకారులు ముందుగానే పేర్లు నమో దు చేసుకోవాలని చెప్పారు. వివరాలకు సెల్: 9010451585 నంబరులో సంప్రదించాలన్నారు. ఆర్గనైజర్లు కృష్ణసాయిరోహిత్, ఆనంద్‌గుప్తా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు గ్రామ పంచాయతీ మజరా గ్రామమైన కదిరిపురం తండాలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపీడీఓ మహబూబ్‌దౌలా శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీపై ఆరా తీశారు. సర్పంచ్ లక్ష్మీబాయి, ఈఓపీఆర్డీ సుదర్శనరావు, కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

అచ్చు పోసి.. ఆకలి తీర్చుకుంటూ

- పొట్ట చేతపట్టుకొని కిలో మీటర్ల కొద్ది పయనం
- దేవతల విగ్రహాల తయారు చేసి విక్రయించి జీవనం
- ఏడాదిలో ఐదారు నెలల పాటు సంచార జీవనం
- కర్ణాటక వాసుల పరిస్థితి


అచ్చువేసిన విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం


తయారు చేసిన విగ్రహాలు

గోస్పాడు: రెక్కడితే కానీ డొక్కడని బతుకులు.. పొట్ట కూటి కోసం సొంత ప్రాంతాలను వదిలి వందలాది కిలోమీటర్లు ప్రయాణం చేయడం వారికి అలవాటైంది. తమ పూర్వీకుల నుంచి అబ్బిన వృత్తితోనే కడుపునింపుకుంటున్నారు. కొందరు ఇనుమును కరిగించి వ్యవసాయ పనిముట్లను తయారు చేస్తుండగా, మరికొందరు ఇత్తడి, సిల్వర్‌ను కరిగించి అచ్చుల్లో వేసి దేవతల ప్రతిమలను తయారు చేసి విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్నారు.. కర్ణాటక రాష్ట్రం బీదర్ వాసులు. స్థానికంగా పనులు దొరకకపోవడంతో అచ్చు పోసి ఆకలి తీర్చుకుంటున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి సుదూర ప్రాంతాలకు వచ్చి రోడ్డు పక్కన కాసింత స్థలం కనిపిస్తే చిన్నపాటి ప్లాస్టిక్ పట్టాతో టెంట్ వేసుకొని వందలాది కుటుంబాలు వృత్తి పని చేసుకుంటున్నారు. ఏటా ఐదారు నెలల పాటు నంద్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జీవనం సాగించి మరో ప్రాంతానికి వలస వెళ్లిపోతారు.

రహదారుల పక్కన జాగా ఉంటే చాలు..

నంద్యాల జిల్లాలోని పలు గ్రామాలు, పట్టణాల్లో ఊరూరా తిరుగుతూ దేవతల విగ్రహాలను తయారు చేస్తున్నారు. వాటిని అచ్చు పోసి, శుభ్రం చేసి, రూపురేఖల్లో తేడాల్లేకుండా చేసి విక్రయించగా వచ్చిన సొమ్ముతో పూట గడుపుతున్నారు. తయారీలో వచ్చే నాలుగు డబ్బులను సంపాదించుకొని తిరిగి సొంతూళ్లకు వెళ్తుంటారు. రోడ్ల పక్కన కొద్దిపాటి జాగాలో పనులు ప్రారంభిస్తారు. కొందరు కొలిమి వద్ద పనిచేస్తుండగా, మరికొందరు తాము పనిచేసే సమీపం ప్రాంతంలో ఇంటింటికీ తిరిగి తయారు చేసిన విగ్రహాలను విక్రయించడం, విగ్రహాల తయారీకి అవసరమైన ముడి సరుకు తెచ్చుకుంటారు. ఉన్న ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి విగ్రహాలను విక్రయిస్తారు. తమ వద్ద ఉన్న ముడిసరుకుతో విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తుంటారు.

రెక్కాడాల్సిందే..

యాంత్రికీకరణ గణనీయంగా పెరిగిన ఈ రోజుల్లోనూ చేతి వృత్తిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పని కోసం పలు పాట్లు పడుతూ కొలిమిలో సిల్వర్, ఇత్తడిని కరిగించి విగ్రహాలు అచ్చువేసే పనిలో నిమగ్నమవుతున్నారు. రహదారి పక్కన కొలిమిలో నిప్పుల పొయ్యి రాజేసుకొని ఆహార పదార్థాలను కూడా అక్కడే తయారు చేసుకొని తింటున్నారు. దేవతా విగ్రహాలను పలు సైజుల్లో చేస్తున్నారు. దేవతా మూర్తులు, వాటి సైజును బట్టి ధరను నిర్ణయిస్తున్నారు. ఒక్కో విగ్రహం రూ.100 నుంచి రూ.150, రూ.200, రూ.800 వరకు తీసుకొని విగ్రహాలు తయారు చేసి అవసరమైన వారికి అందిస్తున్నారు. తమ కుటుంబం రోజంతా కష్టపడినా రూ.700 నుంచి రూ.800 వరకు మిగులుతుందని చెబుతున్నారు.

చిన్నప్పటి నుంచి ఇదే పని



మా పెద్దల కాలం నుంచి విగ్రహాలు అచ్చులు వేస్తూ కాలం వెళ్లదీస్తున్నాం. పనులు చేసుకునేందుకు బీదర్ నుంచి ఇక్కడికి వచ్చాం. చిన్నతనం నుంచి సిల్వర్, ఇత్తడి వంటి వాటిని కరిగించి వివిధ రకాల దేవతా మూర్తుల విగ్రహాలను అచ్చువేస్తూ జీవనం సాగిస్తున్నాం. తల్లి పిల్లలతో కలిసి ఉపాధి కోసం ఊరూరా తిరిగి పనులు చేసుకుంటున్నాం. తమతో పాటు వచ్చిన వారు వివిధ గ్రామాల్లో ఉంటున్నారు.

– వసీం అక్రమ్, విగ్రహాల తయారీ దారుడు

అమరవీరుల త్యాగాలు మరువరాదు

ఉయ్యాలవాడ : దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను మరవరాదని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండలంలోని తుడుమలదిన్నె, గోవిందపల్లె, అల్లూరు, ఎస్.కొత్తపల్లె, మాయలూరు, రూపనగుడి గ్రామ సచివాలయాల ఆవరణలో నామట్టి.. నాదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, అల్లూరు సీతారామారాజు, గాంధీజీ బ్రిటీష్ వారిపై తిరుగుబాటు జెండా ఎగురవేసి, స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారని వివరించారు. అనంతరం సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శులు సతీష్‌కుమార్, సురేష్‌బాబు, అబ్దుల్‌రహీమ్ పాల్గొన్నారు.

నూతన అధికారులను నియమించాలి

నంద్యాల(న్యూటౌన్): నంద్యాల జిల్లాలో బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఇతర శాఖలకు బదిలీ చేసి డీబీసీ డబ్ల్యూఓగా నూతన అధికారులను నియమించాలని రాయలసీమ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ నంద్యాల జిల్లా చైర్మన్ రాజునాయుడు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా ఉన్న లక్ష్మీదేవి వయోభారంతో ఇబ్బందులు పడుతున్నారని, విధులకు హాజరయ్యే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అందరి సంక్షేమమే లక్ష్యం


చింతకుంటలో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఆళ్లగడ్డ: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు చింతకుంట గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందజేసి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమ విప్లవం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో సత్వరమే పరిష్కరించాని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి, సింగం వెంకటేశ్వర్‌రెడ్డి, రంగేశ్వర్‌రెడ్డి, పలచాని మల్లికార్జునరెడ్డి, ఇంజేటి నాగిరెడ్డి, శివనాగిరెడ్డి, శంకర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రాజారెడ్డి, చంద్రారెడ్డి, కౌన్సిలర్‌లు వరప్రసాద్‌రెడ్డి, నరసింహులు, మహబూబ్‌బాషా ఉన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం


కొర్ర విత్తనాలను పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

ఉయ్యాలవాడ : చిరుధాన్యాలు సాగు చేస్తే తక్కువ కాలంలో దిగుబడులు చేతికి అందుతాయని, మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభిస్తుందని వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండలానికి మంజూరైన 9 మినీ కిట్లు కొర్ర విత్తనాలను స్థానిక రైతు భరోసా కేంద్రంలో రైతులకు అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాగు చేసిన అనంతరం 60 నుంచి 70 రోజుల వ్యవధిలోనే పంట చేతికి అందుతుందన్నారు. వర్షాధారం కింద ఈ నెలాఖరు వరకు సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి ధరిణి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


రామకృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలోని చాకరాజువేముల గ్రామ బీసీ ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రామకృష్ణ పదోన్నతిపై బనగానపల్లె మండలానికి బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా శుక్రవారం ఆయనను ఎంపీపీ అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. పాఠశాలల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరేలా, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఆయన చేసిన సేవలను వివరించారు. ఎంఈఓ రామచంద్రయ్య, జెడ్పీటీసీ శకుంతల, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, మోహన్‌నాయుడు, వెంకటసుబ్బనాయుడు, వాసుడు, ఉపాధ్యాయులు అమరేశ్వరప్ప, బ్రహ్మానందరెడ్డి, రామకృష్ణ, కల్యాణ్, రజాక్ బాషా పాల్గొన్నారు.

వినియోగదారుల క్లబ్‌ల ఏర్పాటు



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటరాముడు

నంద్యాల(వ్యవసాయం): ప్రభుత్వ ఆదేశాల మేరకు.. ప్రతి పాఠశాలలో వినియోగదారుల క్లబ్ ఏర్పాటు చేశామని జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటరాముడు తెలిపారు. పాఠశాలల వినియోగదారుల క్లబ్ సమావేశం శుక్రవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో జిల్లా వినియోగదారుల అధ్యక్షుడు న్యాయవాది సయ్యద్ అమీర్ బాషా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటరాముడు మాట్లాడుతూ ఒక క్లబ్‌లో 60మంది 8, 9వ తరగతి విద్యార్థులు సభ్యులుగా ఉంటారని, వీరికి వినియోగదారుల సేవల గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తారన్నారు. జిల్లా అధ్యక్షుడు సయ్యద్ అమీర్‌బాషా మాట్లాడుతూ వస్తు సేవలు పొందిన ప్రతి ఒక్కరూ బిల్లులు తీసుకోవాలని, వాటి నాణ్యత గురించి ఏదైనా ఫిర్యాదు ఉంటే అధికారులకు తెలియజేయాలని చెప్పారు. ఉపాధ్యాయులు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, ఎంఈఓ సుబ్బారెడ్డి, నాగేంద్ర, సంజీవరెడ్డి, సత్యబాబు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ, విజయ్, వాసు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం జాబ్‌మేళా



మాట్లాడుతున్న ప్రతాపరెడ్డి


హాజరైన నిరుద్యోగులు

నంద్యాల(న్యూటౌన్): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జాబ్‌మేళాలు నిరుద్యోగులకు వరమని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌వీఆర్ కాలేజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, జేడీఎం సందీప్ పాల్గొన్నారు. ప్రతాపరెడ్డి మాట్లాడుతూ జాబ్ మేళాకు 15 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా.. 410మంది హాజరయ్యారు. వీరిలో 202 మందిని వివిధ కంపెనీలు ఎంపిక చేసుకున్నాయని తెలిపారు. ఎంపికైన నిరుద్యోగులు ఆయా కంపెనీల్లో చేరాలని సూచించారు. సంస్థ సిబ్బంది సుబ్బన్న, మస్తాన్ పాల్గొన్నారు.

రుణ పంపిణీ వేగవంతం చేయండి

- కేడీసీసీ సమీక్ష సమావేశంలో చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయమనోహరి


మాట్లాడుతున్న ఎస్‌వీ విజయమనోహరి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా సహకార సంఘాలకు అవసరమైన బడ్జెట్ కేటాయించి రుణ పంపిణీ వేగవంతం చేయాలని కేడీసీసీ చైర్‌పర్సన్ ఎస్‌వీ విజయమనోహరి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జోనల్ కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అధ్యక్షులు,కార్యానిర్వాహణ అధికారులు, బ్రాంచిమేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వడ్డీ బకాయిలు 1.58 శాతంగా ఉన్నాయని ఈ ఆర్థిక సంవత్సరం 1 శాతం లోపు పరిమితం చేసే విధంగా పనిచేయాలన్నారు. ఆదేవిధంగా రుణాల పంపిణీ కంప్యూటరీకరణ, పీఏసీఎస్‌లను మల్టిసర్వీస్ సెంటర్లుగా మార్పు చేయడం, కస్టమర్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటు, ఫిష్ ఆంధ్రా అంశాలపై సమీక్ష నిర్వహించారు. సిబ్బంది సమష్టిగా పనిచేయడం వల్ల వరుసగా మూడోసారి రాయలసీమ స్థాయిలో ఉత్తమ డీసీసీబీగా కర్నూలుకు అవార్డు లభించిందన్నారు. పాలకవర్గ సభ్యులు గుండం సూర్యప్రకాశ్‌రెడ్డి, నాసర వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరమ్మ, సీఈఓ రామాంజనేయులు, జీఎం శివలీల, డీఓ ఉమామహేశ్వరరెడ్డి, ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్, డీటీడీఎం నగిరాసుల్తాన్, డీసీఏఓ వెంకటక్రిష్ణ, పలు సహకార సంఘాల చైర్మన్లు, సీఈఓలు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధ్యాత్మిక ప్రవచనాలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని మెయిన్‌బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలోని గీతామందిరంలో ఈనెల 13వ తేదీన ఆధ్యాత్మిక ప్రవచనాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి వాసు, తిమ్మయ్య శుక్రవారం తెలిపారు. సాయంత్రం 6గంటలకు నువ్వు బాగుండాలని-నీ ప్రపంచం బాగుండాలని అనే అంశంపై ప్రముఖ ఆధ్యాత్మిక గురువు జ్ఞానప్రసాద్ ప్రవచనాలు వినిపిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కరపత్రాలను విడుదల చేశారు.

పొలంబడి

ఆళ్లగడ్డ: వ్యవసాయం లాభసాటి కావలంటే మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలం బాచేపల్లి తండాలో శుక్రవారం వైఎస్సార్ పొలంబడి నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంట సాగులో తెగుళ్లు, చీడపీడల నివారణకు చేపట్టాల్సిన విధానాలు, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలో పసుపు పల్లేలు ఏర్పాటు చేయడవల్ల శత్రుపురుగులను నియంత్రిచవచ్చన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని డీ1, డీ2, డీ3 సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏడీ ఆంథోనిరాజు శుక్రవారం తెలిపారు. లైన్లు, సబ్‌స్టేషన్ల మరమ్మతులు, రహదారిల్లోని చెట్ల తొలగింపు తదితర కార్యక్రమాల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జనరల్ స్టోర్‌లో అగ్నిప్రమాదం

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్ సమీపంలోని చంద్ర జనరల్‌స్టోర్‌లో శుక్రవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. చంద్రమౌళి 20 ఏళ్లుగా సాయిబాబానగర్ సమీపంలో జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకొని నిప్పులు రాలి దుకాణంలోని నూనె డబ్బాలపై పడ్డాయి. దీంతో భారీగా మంటలు చెలరేగి దుకాణంలో వస్తువులు అగ్నికి కాలిబూడిదయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదంలో రూ.20 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు అధికారులు అంచనా వేశారు.

వీరులకు వందనం


ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు

దొర్నిపాడు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాభూమి- నాదేశం అనే కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శిలాఫలాకలను ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అలాగే జాతీయన జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ నాగఅనసూయ, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు వీరులకు వందనం

నంద్యాల(సిటీ): దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా 'నా భూమి-నా దేశం, నేల తల్లికి నమస్కారం-వీరులకు వందనం' కార్యక్రమాన్ని శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ రవిచంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, చైర్ పర్సన్ షేక్ మాబున్నిసా, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు.

దేశభక్తి పెంచేందుకే ఆజాదీకా అమృత్ మహోత్సవ్

నంద్యాల(అర్బన్): ప్రజల్లో దేశ భక్తిని పెంపొందించేందుకే ప్రభుత్వం ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండలంలోని కానాల, మిట్నాల, గుంతనాల, బ్రహ్మణపల్లె, పోలూరు, మునగాల గ్రామాల్లో శుక్రవారం నాభూమి-నాదేశం, నేలతల్లికి నమస్కారం, వీరులకు వందనం వేడుకలను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయాల సమీపాల్లో మొక్కలు నాటారు. మునగాల సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు రామచంద్రారెడ్డి, కానాల జగదీశ్వరరెడ్డి, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి సభ్యులు

నంద్యాల(వ్యవసాయం): వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేద్దామని శ్రీ గణేష్ మహోత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉత్తరాధి మఠంలో సమితి నాయకుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుడికి మొదటి పూజ నిర్వహించారు. వారు మాట్లాడుతూ సెప్టెంబర్ 3వ తేదీన ఉదయం 10గంటలకు మొదటి విగ్రహ నిర్వాహకుల సమావేశం, 10న 11గంటలకు రెండవ విగ్రహ నిర్వాహకుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాయకులు నాగేంద్ర, సత్యనారాయణ, శంకర్, కృష్ణమాచార్యులు, హరిబాబు, మోహన్, బ్రహ్మయ్య ఆచారి, రమేష్ పాల్గొన్నారు.

ఓటరు జాబితా తప్పుల్లేకుండా రూపొందించండి


మాట్లాడుతున్న తహసీల్దార్ జయప్రసాద్

దొర్నిపాడు: ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించి తప్పుల్లేకుండా సవరించాలని తహసీల్దార్ జయప్రసాద్ బీఎల్‌ఓలకు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఆయన బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేకు వలంటీర్లతో వెళ్లరాదని ఆదేశించారు. అలాగే ఆయా రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లకు సమాచారం ఇచ్చి వెళ్లాలని చెప్పారు. మృతి చెందిన వారిని ఓటరు జాబితాలో నుంచి తొలగించాలన్నారు. అలాగే 2024 జనవరి 1నాటికి 18 ఏళ్ల నిండే ప్రతి ఒక్క యువతీ, యువకులను జాబితాలో చేర్పాలన్నారు. ఎంపీడీఓ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందాం


జాతీయ జెండాను కొనుగోలు చేస్తున్న ఎంపీ పోచా

నంద్యాల(వ్యవసాయం): స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుందామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి పిలుపునిచ్చారు.నంద్యాల పోస్టల్ శాఖ విక్రయిస్తున్న జాతీయ జెండాను శుక్రవారం ఆయన తన కార్యాలయంలో కొనుగోలు చేసి ఆవిష్కరించారు. నంద్యాల సబ్ డివిజన్ ఏఎస్పీ సత్యనారాయణ మాట్లాడుతూ హర్‌ఘర్ తిరంగా ప్రతి ఒక్కరి ఇంటిపై ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండాను ప్రతి పోస్టాఫీసులో రూ.25కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. పోస్టుమాస్టర్ వెంకటేశ్వరరెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి


చిరుధాన్యాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ సునీత

దొర్నిపాడు: ప్రస్తుత ఖరీఫ్‌లో సాగు చేసిన అన్నీ పంటలను రైతులు ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీత సూచించారు. శుక్రవారం ఆమె మండలంలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును పరిశీలించారు. అనంతరం చిరుధాన్యాల సాగుపై స్థానిక జిల్లా పరిషత్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి వాటి ఉపయోగాలపై అవగాహ కల్పించారు. చిరుధాన్యాల సాగుతో పెట్టుబడులు తగ్గడంతో పాటు అధిక లాభాలు వస్తాయన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో చిరుధాన్యాలు మంచి గిరాకీ ఉందన్నారు.